# నమస్తే తెలంగాణ
# యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, బుధవారం 9 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI


## కేసీఆర్ కృషితోనే ఆలేరుకు గోదావరి జలాలు

- కాంగ్రెస్ నేతల అబద్ధాలకు జనం నవ్వుకుంటున్నారు
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 8 : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే ఆలేరు నియోజకవర్గంలో గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. దసరా పండుగ సందర్భంగా గోదావరి జలాలు ప్రవహిస్తుంటే రైతులు, మహిళలు ఆనం దం వ్యక్తం చేస్తున్నారన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ కల సాకారం అవడం ఎంతో సంతోషానిస్తుందని తెలిపారు. 2018 సంవత్సరం నుంచే ఆలేరుకు కాళేశ్వరం జలాలు వస్తున్నాయన్నారు. 16వ ప్యాకేజీలో భాగంగా నిర్మితమైన డిస్ట్రిబ్యూటరీ కాల్వ గుండా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి చెంతకు చేరాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మితమైన ప్యాకేజీ 14, 15, 16, నవాబ్ పేట జలాశయం, అశ్వరావుపల్లి కాల్వల ద్వారా ఆలేరు నియోజకవర్గంలోని 2.57 లక్షల ఎకరాలకు సాగు జలాలు అందించాలన్న లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడిక్కడ 26 చెక్ డ్యామ్‌ల నిర్మాణం, 23 చెక్ డ్యామ్‌ల ఆధునీకరణ చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తామే చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు నమ్ముతున్నారా, లేదా అనే ఇంగిత జ్ఞానం లేకుండా మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి మాటలు విని జనం నవ్వుకుంటున్నారని తెలిపారు. కాళేశ్వరంలో ఒక్క ఫిలర్ కుంగిపోతే ప్రాజెక్టే పనికి రాదని, కేసీఆర్‌ను బద్నాం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అదే కాళేశ్వరం జలాలను తామే తీసుకొచ్చామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వం 1,400 కిలోమీటర్ల మేర కాల్వలు, 200 కిలోమీటర్ల మేర సొరంగం నిర్మిస్తే ఆలేరుకు గోదావరి జలాలు వస్తున్నాయన్నారు. అసంపూర్తిగా వదిలేసిన జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా నవాబ్‌పేట జలాశయానికి, అక్కడి నుంచి 2018లోనే గుండాలకు సాగు నీటిని విడుదల చేశామన్నారు. రాజాపేట మండలంలోని పలు గ్రామాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో 15వ ప్యాకేజీకి అనుసంధానంగా 19 కిలో మీటర్ల ప్రత్యేక డిస్టిబ్యూటరీ కాల్వను మంజూరు చేసి 6 కిలో మీటర్ల వరకు పనులు కూడా పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కాల్వ ద్వారా కొండారెడ్డి చెరువు, జాల, కుర్రారం, సింగారం వరకు నీళ్లందుతాయన్నారు. కాల్వ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కోసం రైతులకు రూ.12. 40 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగతా పనులు పూర్తి చేస్తే రాజాపేట ప్రాంతానికి సాగు నీరు అందుతుందన్నారు. ఈ కాల్వ గుత్తేదారు గుత్తా అమిత్‌రెడ్డి అని తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టి మిగతా పనులు పూర్తి చేసి రాజాపేటకు నీళ్లందించాలన్నారు. ఇప్పటికే మల్లన్న సాగర్‌కు గోదావరి జలాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, కౌన్సిలర్ ఆవుల మమత, వంగపల్లి మాజీ ఉప సర్పంచ్ రేపాక స్వామి, బీఆర్‌ఎస్ మహిళా విభాగం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లెం స్వాతి, కానుగు భిక్షపతి పాల్గొన్నారు.

## పర్వతవర్ధినిగా అమ్మవారు



యాదగిరిగుట్ట, అక్టోబర్ 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో 6వ రోజు మంగళవారం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, గాయత్రీ జపాలు, లలిత సహస్రనామార్చనలు ఘనంగా జరిపారు. మధ్యాహ్న పూజ. నీరాజన మంత్ర పుష్పాలు, సాయంత్రం శ్రీదేవి నవావరణ పూజ, సహస్రనామార్చన నీరాజనం, మంత్ర పుష్పాల వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

# డిజిటల్ సర్వేకు ససేమిరా!



**ఏ రైతు ఏ పంట వేశారో గుర్తించేదే డిజిటల్ సర్వే**

- చెయ్యలేమని తేల్చిచెప్పిన ఏఈఓలు
- యాప్ కూడా డౌన్‌లోడ్ చేసుకోని వైనం
- పని భారం, అసిస్టెంట్ల లేమి, నిధుల కొరతే కారణం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏఈఓలకు మెమోలు
- గత నెల 27 నుంచి ఆబ్‌సెంట్ వేస్తున్న వ్యవసాయ శాఖ



నల్లగొండ, అక్టోబర్ 8 : ఏ రైతు ఏ పంట వేశారో గుర్తించేందుకు డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించినా అడుగుకు ముందుకు పడడం లేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన వ్యవసాయ విస్తరణ అధికారులకు మూకుమ్మడిగా చెయ్యలేమని చెప్పడంతో ఈ పరిస్థితి నెలకొంది. సర్కారు ఆదేశాలను బేఖాతరు చేసినందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం ఏఈఓలకు మెమోలు జారీ చేసింది. గత నెల 27 నుంచి ఆబ్సెంట్ వేస్తున్నా ఏఈఓలు సర్వేకు సంబంధించిన యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోకపోవడం గమనార్హం. అందుకు వివిధ కారణాలను ఏకరువు పెడుతున్నారు. ఏడాది కాలంగా రైతు వేదికలకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం తమకు గ్రామాల్లో సహాయకులను నియమించాలని, కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని కోరుతున్నారు. 5 వేల ఎకరాలకు ఒక ఏఈఓను నియమించాలనే డిమాండ్ చేస్తూ డిజిటల్ సర్వేను బాయ్‌కాట్ చేస్తున్నారు. గత 27 వరకు విధుల్లో ఉన్నందున అప్పటి వరకు వేతనం తీసుకున్న ఏఈఓలకు ఈ నెల వేతనం ప్రశ్నార్థకంగా మారింది.

### అందరికీ మెమోలు

డిజిటల్ క్రాప్ సర్వే చేయకపోవడంతోపాటు ఏ ఒక్క ఏఈఓ కూడా డీసీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోవటంతో ప్రభుత్వం సీరియస్ అయి అందరికీ మెమోలు ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ప్రతి ఏఈఓకూ గత నెలలోనే మెమోలు ఇచ్చింది. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆబ్సెంట్ వేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో గత నెల 27 నుంచి జిల్లా వ్యవసాయ శాఖ ఆబ్‌సెంట్ వేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తున్నది. నేడో, రేపో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానుండగా ఏఈఓలు తేమ శాతం చూసేందుకు వస్తారా, లేదా అనేది చూడాల్సి ఉంది. ఒకవేళ వస్తే విధులకు హాజరు అవడాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందా, ఆబ్సెంట్ వేస్తుందా అనేది చూడాల్సి ఉంది.

### డిమాండ్లు నెరవేరిస్తేనే చేస్తామని ప్రకటన

రైతు బంధు, రైతు బీమా, ధాన్యం కొనుగోళ్లతోపాటు అనేక పనుల్లో భాగస్వామ్యం చేస్తున్న తమను డిజిటల్ సర్వే పేరుతో ఇబ్బంది పెట్టడం సరికాదని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు గ్రామాల్లో పూర్తి స్థాయిలో సర్వే నెంబర్లపైనే అవగాహన లేదని, 5 వేల ఎకరాలకు ఒక ఏఈఓను నియమిస్తామన్న ప్రభుత్వం ప్రస్తుతం ఒక్కొక్క ఏఈఓకు 10 నుంచి 15 ఎకరాల పరిధిని కేటాయిస్తే ఎలా చెయ్యగలమని ప్రశ్నిస్తున్నారు. ప్రతి గ్రామంలో తమకు ఒక సహకుడిని నియమించడంతో పాటు కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రైతు వేదికలకు ఇవ్వాల్సిన ఏడాది నిధులు(నెలకు రూ.9వేలు) వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 280 మంది ఏఈఓలు ఉన్నారు. మరో 150 మందికిపైగా ఏఈఓల అవసరం ఉన్నట్లు చెప్పున్నారు.

### పంటల వారీగా సర్వేకు ఆదేశం

ఏడాదిలో రెండు సార్లు వానకాలంతోపాటు యాసంగి సీజన్‌లో ఏ రైతు ఏపంట వేశారో డిజిటల్ సర్వే ద్వారా గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగానే గతేడాది రెండు సీజన్లు నల్లగొండ జిల్లాలోని వేములపల్లి మండలంలో పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. ఈ వానకాలం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో 24.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కాగా, ఆయా ప్రాంతాల్లో సర్వేకు ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కాగా, ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క ఏఈఓ కూడా యాప్‌ను ఇప్పటివరకు డౌన్‌లోడ్ చేసుకోలేదు. సర్వే చేయాలంటే రైతు పొలానికి కనీసం 25 మీటర్ల నిడివిలో ఉంటేనే నమోదు అవుతుంది. దాంతో తాము క్షేత్రస్థాయికి వెళ్లలేమంటూ ఏఈవోలు డిజిటల్ సర్వేకు ముందుకు రావడం లేదు.

### ప్రభుత్వ ఆదేశం మేరకు నిర్ణయం

ప్రభుత్వం ఈ సీజన్‌కు సంబంధించి డిజిటల్ సర్వే చేయాలని ఆదేశించింది. ఇప్పటి వరకు ఏఈఓలు అందుకు సంబంధించిన పనులు ప్రారంభించ లేదు. దాంతో ప్రభుత్వ ఆదేశానుసారం అందరికీ మెమోలు ఇచ్చాం. వారి నుంచి సమాధానం లేకపోవడంతో గత నెల 27 నుంచి ఆబ్సెంట్ వేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయాలు ఉంటాయి.

**-పాల్వాయి శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్లగొండ**

## మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

- ఉచిత చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


యాదగిరిగుట్ట: గౌరాయిపల్లి చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

యాదగిరిగుట్ట, అక్టోబర్ 8 : మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని గౌరాయిపల్లి చెరువులో మంగళవారం కలెక్టర్ హనుమంత్ కే జెండగేతో కలిసి ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం మత్స్యకారుల అభ్యున్నతికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సంజయ్, డైరక్టర్లు కృష్ణ, ఝాన్సీ, రవిశంకర్, సతీశ్, శంకరయ్య, కుమార్, నరసింహ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఆపదలో అండగా బీఆర్‌ఎస్

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్ బీమా చెక్కు అందజేత


మల్లయ్య కుటుంబానికి బీఆర్‌ఎస్ బీమా చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, అక్టోబర్ 8 : కార్యకర్తలకు ఆపదలో అండగా నిలిచేది బీఆర్‌ఎస్ పార్టీనేనని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బోయపల్లి మల్లయ్య ప్రమాదవశాత్తు మరణించగా ఆయన కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును మంగళారం నకిరేకల్‌లోని క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్య పడవద్దని, బీఆర్‌ఎస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీటీసీ బాలగోని నర్సింహ, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర శ్రీశైలం, మోటె నరేశ్, నాయకులు ఆవుల శ్రీధర్, గుజ్జల సంజీవరెడ్డి, వీరమల్ల వెంకటేశం, చింటు, బోయపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

## డీఎస్సీ-2024లో 252 మంది ఎంపిక

### అభ్యర్థుల జాబితా విడుదల

**నేడు ఎల్‌బీ స్టేడియంలో ఉత్తర్వులు.. దసరా తర్వాత బడికి కొత్త టీచర్లు**

భువనగిరి అర్బన్, అక్టోబర్ 8 : డీఎస్సీ-2024లో ర్యాంకు సాధించి 1:3 పద్ధతిలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ముగియగా.. వివిధ కేటగిరీల్లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. అందులో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ వివిధ సబ్జెక్టులు, ఎల్పి, పీఈటీ పోస్టులు సాధించిన వారున్నారు. టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు డీఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ఫోన్లు చేసి సమాచారం అందించారు. వారికి బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి నియామక ఉత్తర్వులను అందించనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ తీసుకువెళ్లేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. భువనగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం నుంచి బస్సులు బయల్దేరుతాయని, ఉదయం 9గంటల వరకు అభ్యర్థులు హాజరు కావాలని అధికారులు సూచించారు. దసరా సెలవుల అనంతరం జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో కొత్త టీచర్లు విధుల్లో చేరనున్నారు. జిల్లావ్యాప్తంగా 277 పోస్టులను ఆయా కేటగిరీలో భర్తీ చేయాల్సి ఉండగా 252 పోస్టులను మాత్రమే అర్హులతో భర్తీ చేసినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.



**అభ్యర్థుల ఎంపిక ఇలా..**

ఎస్ఏ బయాలజీ-13, ఎస్ఏ ఇంగ్లిష్-12, ఎస్ఏ హిందీ-6, ఎస్ఏ గణితం-7, ఎస్ఏ గణితం (ఉర్దూ)-1, ఎస్ఏ ఫిజిక్స్-2, ఎస్ఏ పీహెచ్‌వై ఈడీఎస్-1, ఎస్ఏ స్పెషల్ ఈడీఎస్-7, ఎస్ఏ సోషల్-24, ఎస్ఏ తెలుగు-12, ఎల్‌పీ హిందీ-4, ఎల్‌పీ తెలుగు-14, ఎల్‌పీ ఉర్దూ-1, పీఈటీ-2, ఎస్‌జీటీ (తెలుగు)-133, ఎస్‌జీటీ స్పెషల్ ఈడీఎస్-12, ఎస్‌జీటీ (ఉర్దూ)-1


గుండాల మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## గుండాలలో సద్దుల సంబురం

- వైభవంగా పెద్ద బతుకమ్మ వేడుకులు

గుండాల, అక్టోబర్ 8 : గుండాలలో రెండ్రోజుల ముందే సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మంగళవారం సాయంత్రం గ్రామస్తులంతా తాసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న దేవతల బండపై బతుకమ్మలను ఉంచి బతుకమ్మ ఆడారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. సునీత స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం మహిళలు పక్కనే ఉన్న రామసముద్రం చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గుండాలలో ఏడో రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం విశేషం.


గుండాలలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న గ్రామస్తులు

# ఆటో డ్రైవర్లకు ఏదీ జీవన భృతి?

**ఏటా రూ. 12వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ**

- తొమ్మిది నెలలు కావస్తున్నా అందని సాయం
- పథకం ఊసే ఎత్తని రాష్ట్ర ప్రభుత్వం
- ఫ్రీ బస్సులతో ఆటోలకు తగ్గిన గిరాకీ
- ఈఎంఐలు కట్టలేక.. కుటుంబాలు గడువక అవస్థలు
- జీవన భృతి ఇవ్వాలని డ్రైవర్ల డిమాండ్

కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల జీవనం ఆగమ్యగోచరంగా మారింది. చాలామంది డ్రైవర్ల కుటుంబాలకు పూట గడవడమే కష్టమైంది. మహాలక్ష్మి పథకం అనంతరం ఆటోలకు గిరాకీ లేక.. ప్రభుత్వం పట్టించుకోక అరిగోస తీస్తున్నారు. డ్రైవర్ల ఆందోళనలకు దిగొచ్చిన సర్కారు ఏటా రూ.12వేల జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ ఆచరణకు నోచలేదు. స్వయంగా మంత్రులు ప్రకటించి తొమ్మిది నెలలు అయినా ఇప్పటికీ అమలు చేయలేదు.

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)

మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నది. ఆధార్ కార్డు చూపిస్తే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లో ఉచితంగా జర్నీ చేసే వెసులుబాటు కల్పించింది. ఈ పథకం ఆటోల గిరాకీపై ప్రభావం చూపుతున్నది. సర్కారు నిర్ణయంతో తాము తాము వీధిన పడ్డామంటూ ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టగా, డ్రైవర్లను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీకి వారికి మద్దతు నిలిచింది. వరుస ఆందోళనలకు ప్రభుత్వం దిగి వచ్చింది. ఆటో కార్మికుల ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కల్లిబొల్లి మాటలు చెప్పింది. ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ. 12వేల జీవన భృతి కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో ఇదే విషయం స్పష్టం చేశారు. సర్కారు చేసే సాయం రోజుకు రూ.33 అని, ఇది తమ జీవనానికి ఎలా సరిపోతుందని ఆటో డ్రైవర్లు అప్పట్లోనే మండిపడ్డారు. ప్రభుత్వం మాత్రం అది కూడా అమలు చేయడం లేదు. ఇప్పటి వరకూ ఒక్క డ్రైవర్ అకౌంట్లో కూడా రూపాయి పడింది లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులకు దసరా సందర్భంగా బోనస్ ప్రకటించిన ప్రభుత్వం ఆటో కార్మికులను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆటో డ్రైవర్ యూనియన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



### పూట గడవని దుస్థితి

యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 5 వేల ఆటోలు నడుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు నిత్యం వందలాది ఆటోలు వస్తూ పోతూ ఉంటాయి. తద్వారా అనేక కుటుంబాలకు ఉపాధి లభిస్తున్నది. గతంలో నిత్యం ఖర్చులన్నీ పోగా నాలుగైదు వందల చేతికి వచ్చేవి. కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండేది కాదు. ఫ్రీ బస్సు వచ్చాక ఆటోలకు ఆదరణ తగ్గింది. గతంలో వచ్చిన డబ్బులో సగం గిరాకీ కూడా ఉండడం లేదు. రోజుకు రూ.200 కూడా మిగలడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. బండి కిస్తీలు కూడా చెల్లించలేకపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అప్పులు తెచ్చి చెల్లిస్తుండగా, మరికొందరు కిస్తీలు కట్టలేక చేతులెత్తేస్తున్నారు. దాంతో ఫైనాన్స్ వాళ్లు బండ్లను గుంజుకుపోతున్న ఘటనలు కనిపిస్తున్నాయి. ఇటీవల అప్పుల బాధ తాళలేక భూదాన్‌పోచంపల్లి మండలంలో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవన భృతి అందించాలని ఆటో కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

### జీవనభృతి అందించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. సంవత్సరానికి రూ.12 వేలు జీవన భృతిని ఇస్తామని చెప్పి 9 నెలలుగా కాలం గడుపుతున్నది. ఈఎంఐలు కట్టలేక, కుటుంబ ఖర్చులకు వెళ్లక ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన ఆటో డ్రైవర్లు ఉన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం జీవన భృతిని అందించాలి. లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతాం.

**- గనబోయిన వెంకటేశ్, ఆటో యూనియన్ నాయకుడు**

### హామీని నిలబెట్టుకోవాలి



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఆటోలకు గిరాకీ ఉండడం లేదు. పొద్దంతా ఆటో తోలినా ఇంటి ఖర్చులకు వెళ్లడం లేదు. రూ.12వేల జీవన భృతి ఇస్తాన్న ప్రభుత్వం ఇప్పటి వరకూ అమలు చేయలేదు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ప్రభుత్వం స్పందించి జీవన భృతి ఇస్తే ఎంతోకొంత ఆసరా అవుతుంది.

**-కొయ్యడ కృష్ణగౌడ్, ఆటో డ్రైవర్, తంగడపల్లి(చౌటుప్పల్)**

### కిస్తీలు కట్టలేక ఫైనాన్స్ వాళ్లకు ఆటోలు వదిలిపెడుతున్నం



కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమాని ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారు. ఫైనాన్స్ మీద ఆటోలు తీసుకున్న వాళ్లు కిస్తీలు కట్టలేక ఆటోలను వాళ్లకే వదిలేస్తున్నారు. గతంలో దసరా పండుగ వచ్చిందంటే రోజుకు ఐదారు ట్రిప్పులు చౌటుప్పల్-హైదరాబాద్ నడిపేవాళ్లం. ఇప్పుడు రెండు ట్రిప్పులు కూడా పడడం లేదు. బతలేక అప్పుల పాలు అవుతున్నాం. ప్రభుత్వం జీవన భృతి అందించాలి. ప్రతి నెలా పింఛన్ ఇచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

**-వీరమల్ల లింగస్వామి, ఆటో డ్రైవర్ (చౌటుప్పల్ రూరల్)**


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA
సబ్ ఎడిటర్లు కావలెను
ప్రముఖ దినపత్రిక నమస్తే తెలంగాణ
నల్లగొండ యూనిట్
కార్యాలయంలో పని చేయడానికి
సీనియర్ సబ్ ఎడిటర్లు/సబ్ ఎడిటర్లు
కావలెను.
తెలుగు భాష, క్వార్క్ ఎక్స్‌ప్రెస్ మీద పట్టు,
ప్రధాన పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పని చేసిన అనుభవం ఉండాలి.
ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను
hr@tppl.news మెయిల్ ఐడీకి పంపగలరు.
వివరాలకు 040-23291121